
AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
5-6-2026 (Friday)
MAIN EDITION

## రెండు రోజులకే రాజీనామా చేసిన కర్ణాటక మంత్రి..



**అక్షరటుడే, బెంగళూరు:** కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు మొదలయ్యాయి. సీఎం డీకే శివకుమార్ ప్రభుత్వంలో రెండు రోజుల క్రితం మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రామలింగారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆయన ఆశించిన శాఖను కేటాయించకపోవడంతో రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. కర్ణాటక ముఖ్యమంత్రి ఈ నెల 3న డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు 13 మంది మంత్రులు ప్రమాణం చేశారు. వారిలో శాఖల కేటాయింపుపై రామలింగా రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలో తనకు వేరే శాఖ ఇవ్వడంతో అసంతృప్తితో రాజీనామా చేశారు.

## సిలిండర్ పేలి ముగ్గురు సజీవ దహనం



**అక్షరటుడే, నల్గొండ:** సిలిండర్ పేలి ముగ్గురు సజీవ దహనం అయ్యారు. ఈ విషాద ఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని కలాల్‌వాడలో రేకుల ఇంట్లో వనం చంద్రకళ (45) నివాసం ఉంటోంది. గురువారం రాత్రి చంద్రకళ తన మనవడు, మనవరాలితో కలిసి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు యత్నించారు. అయితే అదే సమయంలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు.

## వినుకొండ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్..



**అక్షరటుడే, హైదరాబాద్:** వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నారు. ఫేక్ జీవోలతో గండిపేటలో 10 ఎకరాలు కాజేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అలాగే నకిలీపత్రాలతో రూ. 1500 కోట్ల విలువైన భూకబ్జాకు యత్నించారనే ఆరోపణల నేపథ్యంలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ప్రధాని మోదీని ప్రశంసించిన ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాని మోదీ తనకు మంచి మిత్రుడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "మేము ఒక ఒప్పందానికి వస్తాం, ఎందుకంటే నాకు మీ ప్రధాని అంటే చాలా ఇష్టం. ఆయన నాకు మంచి మిత్రుడు. మా మధ్య మంచి అనుబంధం ఉంది' అని పేర్కొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన అమీర్‌పేట్ (మైత్రీవనం)లో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై టీఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తులు నష్టపోయిన వ్యాపారులను, బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోళ్లు చేతగాక కేంద్రంపై విమర్శలు: ఎంపీ




**అక్షరటుడే, హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం ఎలాంటి ఆంక్షలు పెట్టలేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో 142 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ఇస్తామని ఎఫ్‌సీఐతో ఒప్పందం చేసుకుందన్నారు. కానీ ఇప్పటి వరకు 106 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఇంకా రాష్ట్ర ప్రభుత్వమే ఎఫ్‌సీఐకీ బాకీ ఉందన్నారు. రైతుల మీద రాజకీయాలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గు ఉండాలని విమర్శించారు. ఆయనకు కొనుగోళ్లు చేతకాక కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కోతలు ప్రారంభం అయ్యే సమయానికి సెంటర్లు రెడీ ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని పేర్కొన్నారు. జూన్ వరకు కొనుగోళ్లు పూర్తి కాలేదని విమర్శించారు.

## కొత్త పార్టీని ప్రకటించిన అన్నామలై..



**అక్షరటుడే, చెన్నై:** మాజీ ఐపీఎస్ అధికారి, బీజేపీ మాజీ నేత అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు పేర్కొన్నారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందన్నారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నానని పేర్కొన్నారు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని చెప్పారు.



**రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. బదిలీల ప్రక్రియ సక్రమంగా చేపట్టలేదని వైద్యులు సమ్మెకు దిగారు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. సేవలు అందక వెనుతిరిగారు. అత్యవసర సేవలు మాత్రం యథాతథంగా కొనసాగాయి.**

**– అక్షరటుడే, హైదరాబాద్**

# నిలిచిన ఓపీ సేవలు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల సమ్మె
- పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్
- ఇబ్బందులు పడుతున్న రోగులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్నిశాఖల్లో ప్రభుత్వం బదిలీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జీవో 38 జారీ చేసింది. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యుల బదిలీల్లో నిబంధనలను పాటించలేదని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) ఆరోపించింది. జీవో ప్రకారం బదిలీలు నిర్వహించకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది. దీంతో చాలా మంది వైద్యులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

### అత్యవసర సేవలు మినహా..

ఉస్మానియా, గాంధీ, నిలోఫర్‌తో పాటు అన్ని జిల్లాల ఆసుపత్రుల్లో ఓపీ సేవలను బహిష్కరించారు. అత్యవసర సర్జరీలు మినహా, ముందుగా నిర్ణయించిన ఆపరేషన్లను కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో జీవో 38 జారీ చేసింది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను నిర్దేశించింది. దీని ప్రకారం రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ జీవో ప్రకారం సీనియారిటీ, తప్పనిసరి బదిలీ ప్రమాణాలు, స్పౌజ్ క్రైటేరియా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. కానీ వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని టీజీజీడీఏ నాయకులు ఆరోపిస్తున్నారు.


### పారదర్శకంగా చేపట్టాలి

బదిలీల్లో పారదర్శకత ఉండాలని టీజీజీడీఏ కోరింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేసింది. స్పౌజ్ (భార్యాభర్తలు) కేటగిరీ, అనారోగ్య సమస్యలు ఉండి బదిలీల్లో ప్రాధాన్యత కోరుతున్న వారికి న్యాయం జరగడం లేదని టీజీజీడీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది.



## భారత్‌కు రష్యా బిగ్ ఆఫర్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌కు రష్యా బిగ్ ఆఫర్ ఇచ్చింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సుఖోయ్ ఎస్‌యూ 57 జెట్ విషయంలో ఒక కీలకమైన ప్రతిపాదన చేశారు. మెరుగైన స్టెల్త్ సామర్థ్యాలు కలిగిన ఎస్‌యూ 57ను భారత్‌తో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేసి, ఉత్పత్తి చేయడానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉందని ప్రకటించారు. ఈ విమానాన్ని భారతదేశానికి సరఫరా చేయడానికి, దానిని అభివృద్ధి చేస్తూనే ఉండటానికి మేము సిద్ధంగా ఉన్నాం. మాకు ఎలాంటి సమస్యలు, పరిమితులు లేవు. వాయు రక్షణ వ్యవస్థల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది అని పుతిన్ అన్నారు. రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారానికి ఎటువంటి పరిమితులు లేవని రష్యా అధ్యక్షుడు పేర్కొన్నారు.




## పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం 14 మంది డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ మేరకు రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కొనసాగుతున్న బి.జయశ్రీని సిరిసిల్ల డీఆర్‌వోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి డీఆర్‌వో కె.అనంత రెడ్డిని, నిర్మల్ ఆర్‌డీవోగా దేవదాస్‌ను నియమించింది. సిరిసిల్ల ఆర్డీవోగా డి శ్రీధర్‌బాబు, కరీంనగర్ ఆర్డీవోగా ఎం. షర్మిల, ములుగు ఆర్‌డీవోగా కృష్ణవేణి, మహబూబాబాద్ ఆర్‌డీవోగా ఎం. రాజేశ్వరి, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవోగా వై.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. రాజేంద్రనగర్ ఆర్‌డీవోగా డి.శ్రీధర్, హైదరాబాద్ డీఆర్‌వోగా నారాయణను బదిలీ చేసింది.

## సీఎంఆర్ఎల్‌పై ఈడీ విచారణ..

# కేరళ హైకోర్టు కీలక తీర్పు

**అక్షరటుడే, నేషల్ డెస్క్:** కేరళ రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. సీఎంఆర్ఎల్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తునకు కేరళ హైకోర్టు పచ్చజెండా ఊపింది. సీఎంఆర్ఎల్, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థల మధ్య జరిగిన వివాదాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ తన విచారణను యథావిధిగా కొనసాగించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. కేసులో ఈడీ దర్యాప్తును అనుమతిస్తూ గతంలో హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీఎంఆర్ఎల్ యాజమాన్యం అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఎ. రాజా విజయరాఘవన్, జస్టిస్ కె.వి. జయకుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్.. ఆ అప్పీల్ పిటిషన్‌ను పూర్తిగా కొట్టివేసింది.




## వేధింపులు సహించం..: విప్రో




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** విప్రో సంస్థలో పనిచేసిన ఓ మాజీ మహిళా ఉద్యోగిని చేసిన మతమార్పిడి వేధింపుల ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. ఈ వ్యవహారంపై ఐటీ దిగ్గజం విప్రో తాజాగా స్పందించింది. తమ కార్యాలయాల్లో ఎలాంటి వివక్షకు, వేధింపులకు తావులేదని.. అలాంటి చర్యలను ఏమాత్రం సహించబోమని కంపెనీ స్పష్టం చేసింది. ఒకవేళ విచారణలో తప్పు రుజువైతే సదరు ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తమ సిబ్బంది సంక్షేమం, ఆత్మగౌరవం, స్వేచ్ఛకు భంగం కలగకుండా.. సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని విప్రో పేర్కొంది. ప్రస్తుతం పుణె పోలీసులు చేస్తున్న దర్యాప్తునకు సంస్థ పూర్తి సహకారం అందిస్తోందని, విచారణలో భాగంగా అధికారులు కోరిన పలు కీలక పత్రాలను ఇప్పటికే అందజేసినట్లు వెల్లడించింది.

## ప్రియురాలిని ఆఫీసులోనే పొడిచి చంపిన ప్రేమోన్మాది

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పంజాబ్‌లో ఒక భయంకరమైన ఉదంతం వెలుగుచూసింది. ఆఫీసులో తోటి ఉద్యోగులందరూ చూస్తుండగానే.. ఓ ప్రేమోన్మాది తన మాజీ ప్రియురాలిని కత్తితో విచక్షణారహితంగా పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం తను కూడా ఆత్మహత్యకు యత్నించాడు. పటియాలాకు చెందిన డింపుల్ అనే మహిళ మోహాలీలోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. అదే ఆఫీస్‌లో పనిచేసే హర్జిందర్ సింగ్ అనే వ్యక్తితో ఆమె మూడేళ్లుగా ప్రేమలో ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల వల్ల ఇటీవల వీరిద్దరూ విడిపోయారు. ఈ నేపథ్యంలో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. గురువారం సాయంత్రం తీవ్ర ఆవేశంతో ఆఫీసులోకి ప్రవేశించిన హర్జిందర్.. నేరుగా డింపుల్ వద్దకు వెళ్లి కత్తితో దాడి చేసాడు. ఆమె ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగెత్తినప్పటికీ, వదలకుండా వెంబడించి దాదాపు 20 సార్లు కత్తితో పొడిచాడు. అక్కడున్న తోటి సిబ్బంది నిందితుడిని అడ్డుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. డింపుల్ కుప్పకూలిపోయిన తర్వాత, నిందితుడు అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు.

